సాక్షి
విజయనగరం
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



మానవతామూర్తి మన గురజాడ

సాహితీవేత్త గురజాడ 162వ జయంతి ఉత్సవం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. - 8లో



గిరిజనం అంటే అలుసా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులైంది. గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలు నెరవేరలేదు. - 8లో

బొజ్జగణపతికి లడ్డూ నైవేద్యం



బొబ్బిలి పట్టణంలోని చీపురుపల్లివీధిలో ఏర్పాటుచేసిన త్రిమూర్తి గణపతులకు హిందూ ఉత్సవ సమితి చైర్మన్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 కిలోల లడ్డూను శుక్రవారం నైవేద్యంగా సమర్పించారు. ఈనెల 23న మహానిమజ్జనం సందర్భంగా లడ్డూ ప్రసాదాన్ని వేలంవేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. - బొబ్బిలి

న్యూస్‌రీల్

పాఠశాలలో మొక్కలు నాటిన కలెక్టర్



జొన్నాడ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

డెంకాడ: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా డెంకాడ మండలం జొన్నాడ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మొక్కలు నాటారు. అక్కడికి వచ్చిన కొందరు గ్రామస్తులు కాలువ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని డీపీఓ శ్రీధర్‌రాజాను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జగన్నాథం, సెక్రటరీ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

డ్వామా పీడీగా అరుణశ్రీ



విజయనగరం ఫోర్ట్: జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) పీడీగా అరుణశ్రీ (ఎఫ్‌ఏసీ) నియమితులయ్యారు. ఇక్కడ పీడీగా పనిచేసిన జి.ఉమాపరమేశ్వరి తన మాతృశాఖ అయిన వాణిజ్య పన్నుల శాఖకు వెళ్లిపోవడంతో అరుణశ్రీని నియమించారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

హోరాహోరీగా..

- అండర్-19 స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు



కుస్తీ పోటీలకు సిద్ధమవుతున్న బాలికలు

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన స్కూల్‌గేమ్స్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పువ్వాడ స్కూల్‌లో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. హోరాహోరీగా తలపడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలుర విభాగంలో ఐదుగురు, బాలికల విభాగంలో ఐదుగురిని ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ తెలిపారు.

కొండవెలగాడలో కుస్తీ పోటీలు

రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల కుస్తీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు కొండవెలగాడలో పూర్తయ్యాయి. 16 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో అంతర్ జిల్లాల పోటీలకు అర్హత సాధించారు. వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున పాల్గొంటారని కృష్ణ తెలిపారు.

తాటిపూడి కార్యసాధకుడికి.. కూటమి అవమానం



- తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు నామకరణ లేనట్లే!
- దశాబ్దాల విజయనగరం ప్రజల ఆకాంక్ష గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారం
- తాటిపూడికి గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరుతో నామకరణ
- టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే గొర్రిపాటికి వెన్నుపోటు
- ఆయన పేరును తొలగిస్తూ ఆగమేఘాలపై ఉత్తర్వులు
- పునరుద్ధరించాలన్న జిల్లా ప్రజల విన్నపాలు బేఖాతరు
- వినతిపత్రాలిచ్చినా కేబినెట్ మీటింగ్‌లో నోరెత్తని జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ప్రభుత్వ తీరుపై రగిలిపోతున్న గొర్రిపాటి అభిమానులు
- ఇది తీరని అవమానం అంటూ ఆవేదన



తాటిపూడి రిజర్వాయర్ వద్ద నిరసన తెలుపుతున్న గొర్రిపాటి అభిమానులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

తోటపల్లి ప్రాజెక్టు.. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు అత్యంత ముఖ్యమైన సాగునీటి వనరు. ఈ ప్రాజెక్టు సాధనతో కానీ, అభివృద్ధితో కానీ సంబంధం లేకపోయినా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న పేరుతో నామకరణం చేశారు. ఆయన కుమారుడు గౌతు శ్యామసుందర శివాజీ టీడీపీలో సీనియరు నాయకుడు. లచ్చన్న మనుమరాలు శిరీష ప్రస్తుతం టీడీపీ నుంచి పలాస అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వంశధార ప్రాజెక్టు: శ్రీకాకుళం జిల్లాలో కీలకమైన తాగు, సాగునీటి వనరుకు తొలితరం రాజకీయ నాయకుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు పేరుతో నామకరణం చేశారు.

తాటిపూడి రిజర్వాయర్: విజయనగరం జిల్లాలో సాగునీటి అవసరాలకే కాదు మహావిశాఖ నగర తాగునీటి అవసరాలను తీర్చుతోంది. దీని నిర్మాణానికి కృషి చేసినవారిలో స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక ఉద్యమకారుడు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు అత్యంత ప్రధానమైన వ్యక్తి. నాడు విశాఖ మున్సిపాలిటీ నుంచి కొంతమేర నిధులు సాధించడమే గాక మార్జిన్ మనీలో మిగతా సొమ్ము కోసం గ్రామాల్లో జోలిపట్టి విరాళాలు వసూలు చేసి ఇచ్చారు. ఆయన కృషికి గుర్తింపుగా తాటిపూడి రిజర్వాయరుకు నామకరణ చేయాలని దశాబ్దాలుగా జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఆ ఆకాంక్షను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి రిజర్వాయరుగా నామకరణ చేసింది. దానిపై ఎవ్వరికీ ఎలాంటి అభ్యంతరమూ లేకపోయినా టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ పేరును తొలగిస్తూ ఆగమేఘాలపై గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని రద్దు చేసి మళ్లీ ప్రాజెక్టుకు గొర్రిపాటి పేరును పునరుద్ధరించాలని ఆయన అభిమానులు ఎంత మొత్తుకున్నా పెడచెవినే పెట్టింది. తాజాగా భోగాపురం వద్ద నిర్మాణంలోనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించిన చంద్రబాబు కేబినెట్... తాటిపూడి ప్రాజెక్టుకు గొర్రిపాటి పేరు పునరుద్ధరణ విషయాన్ని కనీసం ప్రస్తావించలేదు. చివరకు ఆ మంత్రివర్గ సభ్యుడైన గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ కూడా నోరు మెదపకపోవడాన్ని గొర్రిపాటి అభిమానులు రగిలిపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో సాకారం...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గొర్రిపాటి అభిమానులు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు విన్నవించారు. ఈ విషయాన్ని ఆయన అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సానుకూలంగా స్పందించారు. ఫలితంగా గొర్రిపాటి బుచ్చిఅప్పారావు తాటిపూడి రిజర్వాయరుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నామకరణం చేసింది.

కూటమి ప్రభుత్వంలో పేరు తొలగింపు

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వస్తూనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోని పథకాలకు, విద్యాసంస్థలకు పేర్లను మార్పు చేస్తూ పోతోంది. అదే వరుసలో తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చిఅప్పా రావు పేరును తొలగిస్తూ గత నెలలో జీవో నంబరు 35ను విడుదల చేసింది. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకొనే స్వాతంత్ర్య దినోత్సవానికి కొద్దిరోజుల ముందే ఆగమేఘాలపై ఇలాంటి వ్యతిరేక నిర్ణయం తీసుకోవడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

తొలి తరం నాయకుడు జీబీ...

స్వాతంత్ర్య సమరయోధుడిగా, బీసీ సామాజిక ఉద్యమవేత్తగా కీలక పాత్ర పోషించిన గొర్రిపాటి బుచ్చిఅప్పారావు (జీబీ అప్పారావు) జిల్లా తొలి తరం నాయకుల్లో ఒకరు. సామాజిక, రైతు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. శృంగవరపుకోట నియోజకవర్గంలోని విజినిగిరి ఆయన స్వగ్రామం. విజయనగరంలో విద్యాభ్యాసం చేశారు. 1931 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. సత్యాగ్రహ ఉద్యమానికి స్థానికంగా నాయకత్వం వహించిన ఘనత గొర్రిపాటిది. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ క్రియాశీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆచార్య ఎన్‌జీ రంగా, గౌతు లచ్చన్నలతో కలిసి భూస్వామ్య వ్యతిరేక ఉద్యమంలోనూ ప్రధాన భూమిక వహించారు. ప్రస్తుత విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా భాగమైన అవిభక్త విశాఖ జిల్లా బోర్డు అధ్యక్షుడిగా 1951లో జీబీ అప్పారావు ఎన్నికయ్యారు. 1960లో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి మరోసారి ఆ పదవిని దక్కించుకున్నారు. 1963లో శృంగవరపుకోట పంచాయతీ సమితి ప్రథమ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1967లో అప్పటి జామి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై శాసనసభలో అడుగు పెట్టారు. పార్టీలకు అతీతంగా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ప్రజాసేవలో ఉన్న ఆయన 1989లో తుదిశ్వాస విడిచారు.

విన్నవించినా.. పట్టించుకోని ప్రభుత్వం

స్వాతంత్ర్య సమరయోధుడిని అవమానించవద్దని, తాటిపూడికి గొర్రిపాటి పేరును పునరుద్ధరించాలని ఆయన అభిమానులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దల మనసు మార్చాలని కోరుతూ జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను, టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతిరాజును కలిశారు. చివరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎన్ని చేసినా ఫలితం శూన్యం. రెండ్రోజుల కిందట జరిగిన మంత్రివర్గ సమావేశంతో వారి ఆశలు ఆవిరైపోయాయి. భోగాపురం వద్ద నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడానికి చంద్రబాబు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అదే సమయంలో తాటిపూడికి గొర్రిపాటి పేరు పునరుద్ధరణ విషయాన్ని పట్టించుకోలేదు. చివరకు అదే సమావేశంలో ఉన్న జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కనీసం నోరెత్తకపోవడం గొర్రిపాటి అభిమానులను మరింత నిరాశపర్చింది.

తాటిపూడి సాధకుడిగా గుర్తింపు...

విజయనగరం జిల్లాలో సాగునీరు, విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి అవసరాలను తీర్చుతున్న తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణానికి జీబీ అప్పారావు విశేష కృషి చేశారు. దాదాపు ఆరు దశాబ్దాల కిందట గోస్తనీ నదిపై తాటిపూడి వద్ద రిజర్వాయర్ నిర్మించాలనే డిమాండ్‌తో దీక్షలు చేశారు. ప్రభుత్వం మంజూరుచేసిన తర్వాత మార్జిన్ మనీ కోసం అప్పటి విశాఖ మున్సిపల్ చైర్మన్ ఒప్పించి కొంతమేర సాధించారు. మిగతా సొమ్ము కోసం గ్రామాల్లో జోలిపట్టి విరాళాలు తెచ్చారు. అంతేకాదు.. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు తన పదెకరాల సొంత భూమినీ ఇచ్చారు. ఆయన కృషితో సాకారమైన ఈ ప్రాజెక్టుకు అతని పేరే పెట్టాలని నాటి నుంచి జిల్లా ప్రజలు కోరుతున్నారు. 2014-19 కాలంలో నాటి చంద్రబాబు ప్రభుత్వానికీ పలుమార్లు విన్నవించారు. ఫలితం లేకపోయింది.

ఫారడే ఆవిష్కరణలు అద్భుతం

- జేఎన్‌టీయూ జీవీలో మైఖేల్ ఫారడే జయంతి
- ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన

విజయనగరం అర్బన్: ఫారడే ఆవిష్కరణలు అద్భుతమైనవని, ఆధునిక సైన్స్, టెక్నాలజీలో కీలకంగా నిలుస్తున్నాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు అన్నారు. వర్సిటీలో సైంటిస్టు మైఖేల్ ఫారడే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరంగా ఫారడే ఆవిష్కరణలు ఉపయోగపడుతున్న తీరును వివరించారు. ట్రిపుల్‌ఈ విభాగం ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ ఆధునిక విద్యుత్ శాస్త్రానికి ఫారడే పరిశోధనలు ఓ మైలురాయిగా పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన సాంకేతిక ప్రాజెక్టులు, వినూత్న పరిశోధనలు, ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లు, ఎలక్ట్రిక్ పరికరాల అప్లికేషన్లను వివరించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ఫారడే పరిశోధనల పుస్తకాన్ని ఆవిష్కరించారు. క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్, సైన్స్ ఫెయిర్, ఫిల్మ్ కాంటెస్ట్ వంటి ఈవెంట్‌లలో 405 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, ఈఈఈ విభాగాధిపతి వీఎస్ వకుల, కన్వీనర్ డాక్టర్ ఎ.పద్మజ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు పి.శ్రీనివాసులరెడ్డి, టి.శిరీష పాల్గొన్నారు.

రౌడీషీటర్ల నడవడికపై నిఘా

- దర్యాప్తులో ఉన్న గంజాయి, మిస్సింగ్, పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై నిశితదృష్టి
- నేర సమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీ వకుల్‌జిందాల్





హాజరైన జిల్లా పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: రౌడీషీట్లు కలిగిన వ్యక్తుల నడవడికను బట్టి మూడు కేటగిరీలుగా విభజించి నిఘా పెట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మాసాంతర నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది ఆకస్మికంగా వాహన తనిఖీలు చేయాలన్నారు. లాడ్జిలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, ముఖ్య కూడళ్లలో తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తుల గురించి ఆరా తీయాలన్నారు. వారి వేలిముద్రలను మొబైల్ వేలిముద్రల యాప్‌తో తనిఖీ చేసి, నేర చరిత్ర ఉన్నదీ? లేనిదీ? తెలుసుకోవాలన్నారు. రాత్రి 11 గంటల తర్వాత సహేతుకరమైన కారణం లేకుండా బయట తిరిగేవారిపై కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. డయల్-100 ఫిర్యాదులపై సకాలంలో స్పందించి, సాధ్యమైనంత వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏటీఎం కేంద్రాలపై నిఘాపెట్టాలన్నారు. ప్రతీ పోలీస్‌అధికారి, సిబ్బంది గ్రామ సందర్శనలు చేయాలని, స్థానికులకు సైబర్ నేరాలు, రహదారిభద్రత, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ మహిళా సంరక్షకుల నుంచి గ్రామంలోని పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసి, వారిపై అభియోగపత్రాలను దాఖలు చేయాలన్నారు. దీపావళి, దసరా పండగలు వస్తున్న నేపథ్యంలో అక్రమంగా బాణాసంచా తయారీ, విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను మాదక ద్రవ్యాల ప్రభావానికి గురికాకుండా చేసేందుకు జిల్లా పోలీస్‌శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంకల్పం కార్యక్రమాన్ని అన్ని కళాశాలల్లో నిర్వహించాలని సూచించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ కేసులు, మిస్సింగ్ కేసులు, అసహజ మరణాల కేసులను సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల ముగిసిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ చేసిన, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురామ్, పలువురు సీఐలు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇ(వి)సుక పాట్లు



ఇసుక కోసం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వరండాలోనే మూడురోజులుగా పడిగాపులు కాస్తున్న భవన నిర్మాణదారులు, వాహన డ్రైవర్లు

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణదారులకు ఇసుక కష్టాలు ఆరంభమయ్యాయి. ఉచిత ఇసుక అంటూనే రవాణాచార్జీల పేరుతో భారం వేయడం ఒకెత్తయితే... అసలు ఇసుకే దొరకకుండా చేయడం మరోఎత్తు. గత ప్రభుత్వం నిల్వ చేసిన ఇసుకను ఎడాపెడా అమ్మేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఇసుక నిల్వచేయడంలో చేతులెత్తేసింది. ఫలితం.. జిల్లావాసులు ఇసుక కోసం రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకుంది. కొత్తవలస, డెంకాడ మండలాల్లోని స్టాక్ యార్డుల్లో ఇసుక నిండుకుంది. కొద్దిపాటి ఇసుక ఉన్న బొబ్బిలి పట్టణానికి చేరువలోని గ్రోత్‌సెంటర్ వద్ద ఉన్న ఇసుక స్టాక్‌పాయింట్ వద్దకు జిల్లా నలుమూలల నుంచి ఇంటినిర్మాణ అవసరాలకోసం తరలివస్తున్నారు. ఇసుక కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో మూడురోజులుగా బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వరండాలోనే భవననిర్మాణదారులు, వాహనడ్రైవర్లు పడిగాపులుకాస్తున్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చే టోకెన్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఇసుక అటు టోకెన్ విధానంలోనూ దొరక్క, ఇటు ఆన్‌లైన్‌లోనూ బుకింగ్‌చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. సీతానగరం నుంచి ఇసుకను తీసుకువచ్చి గ్రోత్ సెంటర్‌లో డంప్ చేస్తామని చెప్పిన అధికారులు, నాయకులు పత్తాలేకుండా పోయారు. దీంతో ఇసుక కోసం తంటాలు తప్పడంలేదంటూ భవన నిర్మాణదారులు వాపోతున్నారు.

టోకెన్ విధానం రద్దు.. ఆన్‌లైన్‌లో అవ్వడంలేదు..



ఇసుక కోసం వచ్చాం. మూడు రోజులుగా గ్రోత్‌సెంటర్, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఇక్కడి అధికారులు టోకెన్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసిందని చెబుతున్నారు. పోనీ సచివాలయానికి వెళ్తే పోర్టల్ సాఫ్ట్‌వేర్ ఇవ్వలేదని అంటున్నారు. ఏ రీచ్‌లోనైనా తవ్వుకునేందుకు అవకాశం లేదు. అలాగని ఇక్కడున్న ఇసుకను ఇవ్వడం లేదు. మా ఇబ్బందులు వర్ణనాతీతం.

- బంధం అప్పలనాయుడు, కొత్తవలస

అక్కడికెళ్తే ఇక్కడకు.. ఇక్కడకొస్తే అక్కడకు...



స్థానిక నదుల్లో ఇసుకను ఇవ్వవచ్చు కానీ అనుమతులు లేవంటున్నారు. గ్రోత్ సెంటర్‌కు వెళ్తే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లమంటున్నారు. పోనీ అక్కడకు వెళ్తే ఇక్కడ ఇసుక టోకెన్లు ఇవ్వడం లేదు... మీరు సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్లో బుక్ చేసుకోవాలని చెబుతున్నారు. అక్కడేమో మాకే ఆదేశాలు రాలేదంటున్నారు. మేం ఇంటి నిర్మాణం కోసం అన్నీ సిద్ధం చేసుకున్నా ఇసుక మాత్రం దొరకడం లేదు. మూడు రోజులుగా ఇక్కడే ఉంటున్నాం. అధికారులు, ప్రభుత్వం కనికరించాలి. ఇదెక్కడి ఉచిత ఇసుక విధానం. - ఎం.ప్రసాద్, ఎల్.కోట

రేపు ఓపెన్ అవుతుంది

ఇసుక పోర్టల్ రేపు ఓపెన్ అవుతుంది. ఇక్కడ కొద్దిగా ఇసుక ఉంది. ఓ మూడు రోజులకు వస్తుంది. అది అయిపోయిన వెంటనే వంగర రీచ్ నుంచి ఇసుక తెచ్చి ఇక్కడ డంప్ చేస్తాం. అప్పుడు అందరూ పట్టుకెళ్లొచ్చు. నదులు, గెడ్డల్లో ఇసుకను తరలించడానికి అనుమతులు లేవు. ఇంకా రీచ్‌లు కేటాయించలేదు. - ఎం శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

అమ్మజాతరకు అంకురార్పణ

- భక్తిశ్రద్ధలతో పైడితల్లి చదురుగుడి, వనం గుడిల వద్ద పందిరిరాట మహోత్సవం
- మండల దీక్షలు చేపట్టిన వందలాది మంది దీక్షాపరులు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు



మాలధారణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ ఈఓ ప్రసాద్, అర్చకులు



పైడితల్లి చదురుగుడి వద్ద పందిరిరాట వేస్తున్న అర్చకులు, ఎమ్మెల్యే అదితి గజపతి, ఆలయ సిబ్బంది, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి జాతర శుక్రవారం పందిరిరాట మహోత్సవంతో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నెలరోజులకు పైగా సాగే ఉత్సవాలకు వేద పండితులు రాటవేసి అంకురార్పణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయమంతా దీక్షాపరులు, భక్తులతో కిటకిటలాడింది. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. ఉదయం 8 గంటలకు పైడితల్లి అమ్మవారి మండల దీక్షలను భక్తులు తీసుకున్నారు. దీక్షాపరులందరికీ ఉచిత రీతిన దీక్షావస్త్రాలు, మాలలను ఈఓ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ముహూర్తం ప్రకారం చదురుగుడి వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణలతో పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర మహోత్సవానికి పందిరిరాట వేసి అంకురార్పణ చేశారు. అనంతరం 11 గంటల ప్రాంతంలో వనంగుడి వద్ద పందిరిరాట వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ చల్లనితల్లి దీవెనలు అందరిపైనా ఉండాలన్నారు. అమ్మవారి జాతర మహోత్సవానికి ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున భారీ ఎత్తున ఏర్పాట్లు చేపడతామని చెప్పారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్టోబర్ 14న తొలేళ్ల సంబరాలు

పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమాను ఉత్సవాన్ని, 22న మంగళవారం తెప్పోత్సవం, 27న కలశ జ్యోతుల ఊరేగింపు, 29న ఉయ్యాల కంబాల మహోత్సవం, 30న చండీహోమంతో జాతర పరిసమాప్తమవుతుందని ఆలయ ఈఓ ప్రసాదరావు తెలిపారు.

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం



కాలిపోతున్న పూరిల్లు

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు గ్రామానికి చెందిన మరడాన సూర్యనారాయణ పూరిల్లు శుక్రవారం తెల్లవారుజామున దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు రూ.60 వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. దగ్ధమైన పూరింటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట: అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల సారాను పట్టుకున్నట్టు ఎస్సై ఎం.జగదీష్‌నాయుడు తెలిపారు. సీతంపేట మండలంలోని దిగువబుడగరాయి గ్రామ సందర్శనకు వెళ్లిన సమయంలో సవర సుంబురు అనే వ్యక్తి సారా తరలిస్తుండగా గుర్తించి పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

58 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

సీతానగరం: మండలంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న నిర్వాహకులపై దాడులు నిర్వహించడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని రామవరంలో ఒక షాపులో 58 మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అనధికారికంగా మద్య విక్రయాలు సాగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సోదాల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జి.అప్పారావు(21)మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం అప్పారావు మొరకముడిదాం నుంచి పెదమానాపురం బైక్‌పై వస్తుండగా వంగర గ్రామానికి చెందిన కుమార్‌నాయుడు గజపతినగరం నుంచి స్వగ్రామం బైక్‌పై వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగి అప్పారావు తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అప్పారావును విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అభినందన



దేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన త్రోబాల్ ఎంపిక పోటీల్లో మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థిని దేవి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో దేవిని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విశాఖలోని మున్సిపల్ స్టేడియంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో దేవి పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఆటోల పట్టివేత



ఇసుకతో పట్టుబడిన ఆటో

నెల్లిమర్ల: పట్టణ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఆటోలను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక చంపావతి నది నుంచి ఇసుక తరలిస్తున్న వీటిని మిమ్స్ ఆస్పత్రి సమీపంలో వీఆర్‌ఓలు పట్టుకుని తహసీల్దార్ సుదర్శనరావుకు అప్పగించారు. ఆయన ఒక్కో ఆటోకు రూ.2 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

మానవతా మూర్తి మన గురజాడ

- నేడు మహాకవి 162వ జయంతి
- వేడుకల్లో పాల్గొననున్న రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు
- కలెక్టరేట్ ఆడిటోరియంలో సభా, సాంస్కృతిక కార్యక్రమాలు

మనిషిని ప్రేమించడమే తన మతంగా చెప్పుకున్న మానవతా మూర్తి గురజాడ వేంకట అప్పారావు. 'బతికి చచ్చియు ప్రజలకు ఎవడు ప్రీతి చేకూర్చునో వాడే ధన్యుడు' అంటూ మానవత్వాన్ని వినిపించిన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. ఆయన విజయనగర ఖ్యాతిని దశదిశలా ఇనుమడింపచేశారు. విద్యలనగరమైన విజయనగరంలో సాహితీ సౌరభాలను కురిపించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో వేగుచుక్కలా మెరిశారు. వందల ఏళ్లు దాటినా ఆయన అజరామరుడే.

'ఆకులందున అణిగీమణిగీ కవిత కోయిల పలకవలెనోయి' అంటూ ప్రజల కోసం ప్రజల భాషలోనే రాయాలని తలచిన సామాజిక విప్లవమూర్తి గురజాడ అప్పారావు. ఆయన రచనలన్నీ వేటికవే ఆణిముత్యాలు. గురజాడ రచనలన్నీ మాసిపోయినా ఒక్క దేశభక్తి గీతం 'దేశమంటే మట్టి కాదోయి' మిగిలినా చాలు ప్రపంచ కవుల్లో గురజాడ ఒకరని రుజువు చేయడానికి సాక్ష్యమని శ్రీశ్రీ వంటి మహాకవి గురజాడను కొనియాడారు. గురజాడ రచనల్లో ఒక్కోటి ఒక్కో సమస్యను చర్చిస్తుంది.



గురజాడ వేంకట అప్పారావు

విజయనగరం టౌన్:

సాహితీవేత్త గురజాడ నడయాడిన నేలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురజాడ 162వ జయంతి ఉత్సవాన్ని శనివారం అధికారికంగా నిర్వహించనున్నాయి. ఉదయం 9 గంటలకు మహాకవి స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన, విగ్రహానికి ప్రముఖులు పూలమాలాలంకరణ చేస్తారు. 9.30 గంటలకు గురజాడ కూడలి వద్ద ఉన్న గురజాడ కాంస్య విగ్రహానికి పూలమాలాలంకరణ కార్యక్రమం ఉంటుంది. అనంతరం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లో ఉన్న ఆడిటోరియంలో సభా కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11 గంటలకు ప్రముఖుల సందేశాలు, 11.45 గంటలకు ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారులు, గురజాడ వంశీయులకు సన్మాన కార్యక్రమాలు, 12 గంటలకు వందన సమర్పణ ఉంటాయి.



గురజాడ గృహం

గురజాడ ప్రస్థానం..

సామాజిక సమస్యలపై సాహితీ సమరం పూరించి, విశ్వ సాహితీ వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మిన సాహితీ సౌరభం మన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21న రాయవరంలో జన్మించారు. మహారాజా విద్యాసంస్థల్లో గిడుగు సహ విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. ఆయన 23వ ఏట అప్పలనరసమ్మతో వివాహం జరిగింది. ఆయనకు వెంకట రామదాసు, కొండయ్యమ్మలు సంతానం. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కన్యాశుల్కం పేరుతో 1892 ఆగస్టు 13న తొలికూర్పును గురజాడ ప్రదర్శించారు. 1897లో ఆనందగజపతికి అంకితం ఇచ్చారు. రెండో కూర్పును 1909లో ప్రచురించారు. అప్పట్లో సంస్కృత భాషకు ఆదరణ ఎక్కువగా ఉండేది. ముత్యాలసరాలు రచించి సామాన్యునికి అర్థమయ్యే విధంగా అందజేశారు. 1883లో సారంగధర, డామిట్ కథ అడ్డం తిరిగింది, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, లవణరాజు కల, నీలగిరి పాటలు, కాసులు, బిల్హణీయం, కన్యక, సుభద్ర, దించు, లంగరు, తదితర ఎన్నో అద్భుతమైన రచనలు గురజాడ కలం నుంచి జాలువారాయి. అన్నింటికన్నా ముఖ్యమంగా 'దేశమును ప్రేమించుమన్నా' అంటూ దేశభక్తి గేయం రాసి విమర్శకుల ప్రసంసలు పొందారు. రాజా వారి కోర్టు దావాలలో ఎడతెరిపి లేకుండా ఆ భారాన్నంతా తన భుజాన్ని వేసుకుని పనులు చేశారు. అప్పటికే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. 1915 నవంబరు 30న ఉదయం 8.20 గంటలకు ఆ మహనీయుడు పరమపదించారు.



గృహం లోపల గురజాడ అప్పారావు విగ్రహం



గురజాడ వాడిన స్టాంప్, కళ్లద్దాలు



గురజాడ చరిత్రకు సంబంధించిన ఎగ్జిబిషన్



గురజాడ వాడిన పుస్తకం



ముఖద్వారం వద్ద గురజాడ చిత్రపటం



మహాకవి సమకాలీన మేధావుల చిత్రపటాలు



గురజాడ గేయాలతో బోర్డు



గురజాడ జ్ఞాపకాలు

ఆకట్టుకున్న గురజాడ చిత్రరూపం

మహాకవి గురజాడ వెంకట అప్పారావు రచించిన కన్యాశుల్కంలోని పాత్రధారులతో జిల్లాకు చెందిన ప్రముఖ చిత్రకారిణి, లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌హోల్డర్ సిరిపురపు ప్రవల్లిక నారాయణ్ వేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది.

పేదల బియ్యం పట్టివేత

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం పెద్ద ఎత్తున పట్టుబడ్డాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం రేషన్ డిపోల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యం అక్రమంగా తరలిపోతుండగా గరివిడి రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి 6,742 కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. గుర్ల మండలంలోని చోడవరం గ్రామంలో బి.వెంకటరమణ అనే వ్యక్తి ఈ రేషన్ బియ్యాన్ని సేకరించాడు. ఈ రేషన్ బియ్యాన్ని తరలించేందుకు ఒడిశా నుంచి ఓ లారీని తీసుకువచ్చి లోడ్ చేయించాడు. ఈ నేపథ్యంలో బియ్యాన్ని తరలిస్తూ గరివిడిలో గల అన్నపూర్ణ వేబ్రిడ్జి వద్ద బరువు తూయించే క్రమంలో విజిలెన్స్ ఎస్సై రామారావు, గరివిడి సీఎస్‌డీటీ శోభ సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. సీఎస్‌డీటీ శోభ మాట్లాడుతూ పట్టుబడిన 67 క్వింటాళ్ల 42 కిలోల బియ్యాన్ని చీపురుపల్లి ఎంఎల్‌ఎస్ గొడౌన్‌కు తరలించామని, వాహనాన్ని సీజ్‌చేసి గరివిడి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు.



అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు

పశువులు తరలిస్తున్న బొలెరో వాహనాల పట్టివేత

పాచిపెంట: పశువులను వాహనంలో కిక్కిరిసినట్లు ఎక్కించి అక్రమంగా తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా ఒడిశా రాష్ట్రం నుంచి మానాపురం సంతకు పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాలను పట్టుకున్నామన్నారు. వాటిని రవాణా చేసేందుకు వారి వద్ద లైసెన్సులు లేవని, యానిమల్ ట్రాన్స్‌పోర్టేషన్ రూల్స్ పాటించని సదరు వాహనదారులు, వాహనచోదకులపై కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేశామని తెలిపారు.



పట్టుకున్న బొలెరో వాహనాలను చూపిస్తున్న ఎస్సై వెంకట సురేష్

లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరావు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ పక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి అడ్వయజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోగ్రాం అధికారులు విధిగా స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేయాలని ఆదేశించారు. సరోగసీ రెగ్యులేషన్ చట్టం 2021 ప్రకారం జిల్లాలో ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, గైనకాలజిస్టు డాక్టర్ ఉమామహేశ్వరి, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సుజాత దేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

వరదబాధితులకు మేముసైతం

- పలు పాఠశాలల విద్యార్థుల విరాళం
- కలెక్టర్‌కు చెక్కుల అందజేత

విజయనగరం అర్బన్: జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు వరద బాధితుల సహాయానికి సిద్ధంగా ఉన్నామంటూ తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాల మొత్తాన్ని పలు పాఠశాలల విద్యార్థులు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్‌కు కలెక్టరేట్‌లో అందజేశారు. గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన జెడ్పీ హైస్కూల్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.14,091 అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి ఈ మేరకు చెక్కును కలెక్టర్‌కు అందించారు. అదేవిధంగా జామి మండలం విజినిగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాల మొత్తం రూ.10,890 కలెక్టర్‌కు కలెక్టరేట్‌లో అందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరావు, ఈశ్వరరావు, పీవీకృష్ణారావు తదితరులు ఉన్నారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల నుంచి చెక్కులను అందుకుంటున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

గిరిజనం అంటే అలుసా?

- విద్యాసంస్థల్లో హెల్త్ వలంటీర్ నియామకం లేదా?
- కానరాని నాల్గో తరగతి సిబ్బంది నియామకం
- ప్రారంభం కాని డీఎస్‌సీ కోచింగ్
- ఐటీడీఏ పీఓను నియమించేదెప్పుడు?


సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులైంది. అయినా గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలు నెరవేరలేదు. ముఖ్యంగా గిరిజన విద్యాసంస్థల్లో హెల్త్ వలంటీర్‌లను, నాల్గోతరగతి సిబ్బందిని నియమిస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్వయంగా ప్రకటించారు. అయితే ఇంతవరకు ఆ హామీ నెరవేరలేదు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమపాఠశాలలు, మరో 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 16 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గిరిజన విద్యార్థులు జ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడితే హెల్త్ వలంటీర్లు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతిరోజూ ఏరియా ఆస్పత్రితో పాటు, మిగతా పీహెచ్‌సీలకు విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది తరలించే పరిస్థితి ఉంది. కనీసం ప్రథమ చికిత్స చేసిన వారు కూడా లేక అవస్థలు పడాల్సి వస్తోంది.

నాల్గో తరగతి సిబ్బంది లేక అవస్థలు

నాల్గో తరగతి సిబ్బంది సైతం ఏ ఆశ్రమ పాఠశాలలో చూసినా లేరు. కొన్ని పాఠశాలల్లో రోజువారీ వేతన ప్రాతిపదికన వంటవారిని, కూరగాయలు కోసేవారిని, ఇతర పనివారిని పాఠశాల యాజమాన్యమే తెప్పించుకుని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తోంది. కొన్ని పాఠశాలల్లో 500కు మించి విద్యార్థులు ఉన్నారు. వారికి మూడు పూటలా వండి వడ్డించడం కష్టసాధ్యమైన పని. ఈ తరుణంలో వంటవారిని, వారికి సహాయకులను నియమిస్తే సమస్యలు కొంత మేర పరిష్కారమవుతాయి. ఈ సమస్యలపై గిరిజన మంత్రికి గిరిజన సంఘాల నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. త్వరితగతిన హెల్త్‌వలంటీర్‌లను నియమిస్తామని, నాల్గో తరగతి సిబ్బందిని కూడా నియమించడానికి చర్యలు తీసకుంటామని గిరిజన మంత్రి హామీ ఇచ్చినా ఇంతవరకు అతీగతీ లేదు.



హెల్త్ వలంటీర్‌లను నియమించాలని వినతి ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు



గత నెలలో డీఎస్సీ కోచింగ్‌కు ప్రవేశపరీక్ష రాసిన నిరుద్యోగులు

డీఎస్సీ కోచింగ్ ఎప్పుడు?

గిరిజన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇప్పిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష సైతం నిర్వహించారు. 200మంది వరకు ఎంపిక చేసి ఉచిత కోచింగ్ స్థానిక వైటీసీలో ఇప్పించడానికి ప్రణాళికలు రూపొందించారు. కానీ ప్రత్యేక డీఎస్సీ కోచింగ్ ఇంతవరకు ప్రారంభించలేదు.

ఐటీడీఏకు పీఓ నియామకమెప్పుడు?

స్థానిక ఐటీడీఏకు ఇంతవరకు పీఓను నియమించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐఏఎస్‌ల బదిలీల్లో సీతంపేట ఐటీడీఏకు ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను పీఓగా నియమించి కేవలం పక్షం రోజుల్లోనే బదిలీచేశారు. అటు తర్వాత మరో పీఓను నియమించకుండా పాలకొండ సబ్‌కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పట్లో పీఓను ప్రత్యేకంగా నియమించే పరిస్థితులు కనిపించడం లేదు.

హామీల అమలులో వైఫల్యం



హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది. వంద రోజుల పాలనలో ఏం చేశారో వారికే తెలియాలి. గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య వలంటీర్‌లను వెంటనే నియమిస్తామని ప్రకటించిన మంత్రి ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదు. కనీసం పీఓను కూడా ఐటీడీఏకు నియమించకపోవడం చూస్తుంటే కూటమి పాలన ఎలా ఉందో ఇట్టే అవగతమవుతోంది.

విశ్వాసరాయి కళావతి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే